వైభవంగా దమ్మక్క సేవా యాత్ర

దమ్మక్క విగ్రహం వద్ద పూజలు చేస్తున్న గిరిజనులు, ఆలయ అధికారులు, ఉద్యోగులు

భద్రాచలం, జూలై 21: భక్త రామదాసు ఆలయాన్ని నిర్మించక ముందే సీతారామ, లక్ష్మణ విగ్రహాలకు పూజలు నిర్వహించిన ఆధ్యురాలు అయిన గిరిజన మహిళ పోకల దమ్మక్క సేవా యాత్రను ఆదివారం వైభవంగా జరిపారు. ఆషాడ పౌర్ణమిని పురస్కరించుకొని ప్రతి సంవత్సరం దేవస్థానం తరపున దమ్మక్క సేవా యాత్ర నిర్వహించడం ఆనవాయితీ. ముందుగా దమ్మక్క చిత్ర పటంతో ఆలయ ప్రదక్షిణ నిర్వహించి, ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన దమ్మక్క విగ్రహానికి ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం మేళతాళాలు, మంగళవాయిద్యాలు, కోలాటాల నడుమ గిరి ప్రదక్షిణ చేసి స్థానిక తెలంగాణ టూరిజం హోటల్ సమీపంలో ఉన్న దమ్మక్క విగ్రహానికి ప్రత్యేక పూజలు చేసి, పూలు, పండ్లు సమర్పించారు. స్వామివారి నిత్య కల్యాణ మూర్తులకు మరల ప్రత్యేక పూజలు నిర్వహించి, స్వామివారికి కల్యాణం జరిపి, గిరిజనులకు వస్త్రాలను, పండ్లను అందజేశారు. కార్యక్రమంలో దేవస్థానం ఆలయ ప్రధానార్చకులు పొడిచేటి సీతారామానుజాచార్యులు, ఏఈవో భవాని రామకృష్ణ, ఆలయ సూపరింటెండెంట్లు కత్తి శ్రీనివాస్, లింగాల సాయిబాబా, ఆలయ అర్చకులు పాల్గొన్నారు. ఈ ఏడాది వర్షం కారణంగా గిరిజన సంప్రదాయ రేలా నృత్యాలు, కొమ్ము నృత్యాలు లేకుండానే గిరి ప్రదక్షిణ నిర్వహించారు.

ఆర్ కొత్తగూడెంలో స్వామివారి కల్యాణం

ఈ ఏడాది నూతనంగా గిరిజనుల సమక్షంలోనే ఆషాఢ పౌర్ణమి రోజున స్వామివారి కల్యాణం నిర్వహించేందుకు దేవస్థానం అధికారులు నిర్ణయించారు. అందులో భాగంగా ఆదివారం చర్ల మండలంలోని ఆర్ కొత్తగూడెంలో దేవస్థానం ప్రచార రథంలో స్వామి వారి విగ్రహాలను తీసుకెళ్లి ఆ గ్రామంలోని రామాలయంలో స్వామివారి కల్యాణోత్సవాన్ని వైభవంగా జరిపారు. అనంతరం భక్తులకు దేవస్థానం తరపున అన్నదానం నిర్వహించారు.

పాలేరుకు చేరిన సాగర్ జలాలు

నాయకన్‌గూడెం ఇన్‌ఫాల్ వద్ద సాగర్ నీటిని పరిశీలిస్తున్న ఇరిగేషన్ ఈఈ వెంకటేశ్వర్లు, మిషన్ భగీరథ ఈఈలు హేమలత, డీఈ మురళీకృష్ణ

కూసుమంచి, జూలై 21: సాగర్ ఎడమ కాలువకు శుక్రవారం నీరు విడుదల చేయడంతో ఆదివారం సాయంత్రం పాలేరు రిజర్వాయర్‌కు చేరుకున్నాయి. ప్రస్తుతం వెయ్యి క్యూసెక్కులు వచ్చి చేరుతుండగా సోమవారానికి సుమారు 3 వేల క్యూసెక్కులు రానున్నాయి. ప్రస్తుతం పాలేరు నీటిమట్టం డెడ్ స్టోరేజీకి చేరుకోవడంతో తాగు నీటి అవసరాల కోసం నీటిని విడుదల చేశారు. ఈ నీటిని కేవలం మిషన్ భగీరథ తాగు నీటి అవసరాలకు మాత్రమే వాడుకోవాలని అధికారులు నిర్ణయించారు.

పరిశీలించిన ఇరిగేషన్, మిషన్ భగీరథ అధికారులు

పాలేరు రిజర్వాయర్‌కు సాగర్ నుంచి వస్తున్న నీటిని ఇరిగేషన్ ఈఈ మంగలపుడి వెంకటేశ్వర్లు, డీఈ రత్నకుమారి, మిషన్ భగీరథ ఈఈ హేమలత, డీఈ మురళీకృష్ణ పరిశీలించారు. పాలేరుకు వారం రోజుల పాటు నీరు రానున్నట్లు అధికారులు తెలిపారు.

పెదవాగు ప్రాజెక్టుకు. పూర్వవైభవం తెస్తాం..

- ప్రభుత్వపరంగా బాధ్యత తీసుకుంటాం..
- నష్టపోయిన ప్రతి రైతుకూ న్యాయం చేస్తాం..
- పెదవాగు పరిశీలనలో మంత్రి తుమ్మల

పెదవాగు ప్రాజెక్టు గండి పడిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న మంత్రి తుమ్మల

అశ్వారావుపేట రూరల్, జూలై 21:పెదవాగు ప్రాజెక్టుకు పూర్వవైభవం తీసుకొస్తామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఇందుకోసం ప్రభుత్వపరంగా బాధ్యత తీసుకుంటామని, వచ్చే సీజన్ నాటికి సాగునీరు అందించేలా చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. భద్రాద్రి జిల్లా అశ్వారావుపేట మండలం గుమ్మడవల్లి గ్రామ సమీపంలోని పెదవాగు ప్రాజెక్టుకు ఇటీవల గండి పడిన విషయం విదితమే. ఈ మేరకు అశ్వారావుపేట మండలంలో ఆదివారం పర్యటించిన మంత్రి తుమ్మల.. గండి పడిన ప్రదేశాన్ని, గుమ్మడవల్లి నుంచి ప్రాజెక్టు కు వెళ్లే రహదారిని, దానికి పడిన గండ్లను, పొలాల్లో వేసిన ఇసుక మేటలను, వరి పంట కొట్టుకుపోయిన పొలాలను, వరద వల్ల మునిగిన ఇళ్లను పరిశీలించారు. 'ఇరిగేషన్ అధికారుల నిర్లక్ష్యం వల్లే ప్రాజెక్టుకు గండి పడింది' అంటూ ఈ సందర్భంగా పలువురు రైతులు.. మంత్రికి ఫిర్యాదు చేశారు. ఆ తరువాత స్థానికంగా ఉన్న ప్రభుత్వ గిరిజన గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి తుమ్మల మాట్లాడారు. ప్రాజెక్టుకు గండి పడిన సమయంలో తనకు స్థానిక రైతులు సమాచారమిచ్చారని, తాను వెంటనే కలెక్టర్, ఎస్పీలను అప్రమత్తం చేశానని వివరించారు. గతంలో మాదిరిగా వరద ఎక్కువవుతుందేమోనని భావించి.. వరద ఉధృతిని తట్టుకునే విధంగా ఇసుకబస్తాలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. హైదరాబాద్ నుంచి హైలికాప్టర్లు నారాయణపురం చేరుకోవడానికి ఎక్కువ సమయం పడుతుంది కాబట్టి వెంటనే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో మాట్లాడి సత్వరమే రెండు హెలికాప్టర్లను పంపించినట్లు వివరించారు. వాటి వల్ల 48 మంది ప్రాణాలను కాపాడగలిగామన్నారు. కలెక్టర్, ఎస్పీ, ఐటీడీఏ పీవోలు సమన్వయంతో పని చేసి ప్రాణ నష్టం లేకుండా రక్షించారని అన్నారు. ప్రభుత్వం తరపున వారిని అభినందిస్తున్నామన్నారు. పెదవాగు ప్రాజెక్టుకు గతంలోనూ ఇదే ప్రాంతంలో గండి పడిందని గుర్తుచేశారు. దీనికి రీ మోడలింగ్ చేయాల్సి ఉందని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం 20 శాతం, ఆంధ్రప్రదేశ్ 80 శాతం వ్యయంతో ఈ ప్రాజెక్టు పనులు చేపట్టాలని అన్నారు. ప్రాజెక్టుకు మూడు గేట్లను విస్తరించి.. 5, 6 గేట్లకు పెంచితే ఇలాంటి ప్రమాదాలు జరగవని అన్నారు. ఈ ఘటన దురదృష్టకరమని, రైతులు బాధ తీర్చలేనిదని అన్నారు. 512 మంది రైతులకు తీవ్రనష్టం జరిగిందని, సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి సమస్యను తీసుకెళ్లి ప్రతి రైతునూ ఆదుకుంటామని, న్యాయం చేస్తామని అన్నారు. ప్రస్తుతం కూలిన, దెబ్బతిన్న నివాసాల బాధితులకు రూ.3,94,700ను పంపిణీ చేస్తామని చెప్పారు. పంట నష్టం, ఇసుక మేట లేసిన భూముల వివరాలు ప్రభుత్వానికి అందిన తరువాత నిర్ణయం తీసుకుంటామన్నారు. ప్రస్తుతం పంటలు సాగు చేసే పరిస్థితి లేనందున కూరకాయలు, మినుములు, పెసర వంటి పంటలు సాగు చేసుకోవాలని రైతులకు సూచించారు. బాధితులకు రెండు పూటలా భోజనాలు ఏర్పాటు చేసి నిత్యావసర వస్తువులు అందచేయాలని ఆర్‌డీవోను ఆదేశించారు. కలెక్టర్ జితేశ్ వి పాటిల్, ఎస్పీ రోహిత్‌రాజు, డీసీసీబీ డైరెక్టర్ నిర్మల పుల్లారావు పాల్గొన్నారు.

నేటి నుంచి విద్యా వారోత్సవాలు

ఖమ్మం ఎడ్యుకేషన్, జూలై 21: నూతన విద్యావిధానం-2020 అమలులోకి వచ్చి 4 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఈ నెల 22 నుంచి 29వ తేదీ వరకు శిక్ష సప్తాహ్(విద్యా వారోత్సవాలు) నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా సాధారణ బోధనకు భంగం కలగకుండా తప్పనిసరిగాఈ ప్రతిరోజు ఒక ఇతివృత్తంలో కార్యక్రమాలు నిర్వహించాలి. ఇందుకు సంబంధించి ఈ నెల 19వ తేదీన ఎంఈవోలు, హెచ్ఎంలకు డీఈవో ఆదేశాలు ఇచ్చారు. పాఠశాలలో ఆయా ఇతి వృత్త అంశాలపై నిర్వహించిన కార్యక్రమాలకు సంబంధించి జియో టాగ్ కలిగిన ఫొటోలు, వీడియోలను గూగుల్ డ్రైవ్‌నందు అప్‌లోడ్ చేయడంతో పాటు నివేదిక రూపొందించాలని పేర్కొన్నారు.

ఎంఈవోల పర్యవేక్షణ

మండల స్థాయిలో అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో వారోత్సవాల నిర్వహణను మండల విద్యాధికారులు, మండల నోడల్ అధికారులు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు పర్యవేక్షణ చేయనున్నారు. తమ పరిధిలోని పాఠశాలల్లో జరిగే ఉత్సవాల్లో పాల్గొని జియో టాగ్ ఫొటోలను ఉన్నాతాధికారులకు అందజేయాల్సి ఉంది. కేంద్ర ప్రభుత్వం స్థాయి నుంచి ఎంఈవో స్థాయి వరకు పర్యవేక్షణ చేయనున్నారు. జిల్లాలో ప్రాథమిక పాఠశాలలు - 813, ప్రాథమికోన్నత పాఠశాలలు-192, ఉన్నత పాఠశాలలు -230 కాగా మొత్తం విద్యార్థులు 67,229 మంది ఉన్నారు. వీరందరికి 7 రోజుల పాటు వారోత్సవాలు నిర్వహించాలి.

7రోజుల కార్యక్రమాలు

22న.. ఉపాధ్యాయులు స్థానిక అవసరాలకు అనుగుణంగా అందుబాటులో ఉన్న సామగ్రితో టీఎల్ఎం తయారుచేసి వాటిని తరగతి గదిలో ప్రదర్శించాలి.

23న.. ఉపాధ్యాయులందరూ తమ పాఠశాలలో నిపుణ్‌భారత్ కార్యక్రమాలను అమలు చేయాలి.

24న.. క్రీడా, యువజన వ్యవహారాల శాఖ, ఎన్ఎస్ఎస్ సమన్వయం చేసుకుంటూ పాఠశాలలో ఆటల పోటీలు నిర్వహించాలి.

25న.. విద్యార్థులలో ఐకమత్యం, భిన్నత్వం గురించి అవగాహన కల్పించేలా సాంస్కృతిక కార్యక్రమాలు జరపాలి.

26న.. విద్యార్థుల్లో ప్రస్తుత ఆధునిక కాలంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా నైపుణ్యాలను పెంపొందించే కార్యక్రమాలు, డిజిటలీకరణ గురించి వివరించాలి.

27న.. విద్యార్థుల్లో ఎకో క్లబ్స్, పర్యావరణం, ఆరోగ్యకరమైన ఆహారం గురించి అవగాహన కల్పించాలి.

29న.. పాఠశాల అభివృద్ధిలో సమాజ భాగస్వామ్యం పెంపొందించేలా, నైపుణ్యాలు పెంచే కార్యక్రమాలు నిర్వహించాలి.

'తుమ్మల' పర్యటనకు 'జారె' గైర్హాజరు

- పొంగులేటి వర్గీయుడి ముద్రపడడంతో స్థానికంగా చర్చనీయాంశం
- సొంత నియోజకవర్గంలో మంత్రి పర్యటన వేళ హైదరాబాద్‌లో మకాం
- మంత్రి పొంగులేటితో కలిసి 'మువ్వా' ప్రమాణ స్వీకారానికి హాజరు

అశ్వారావుపేట రూరల్, జూలై 21: భద్రాద్రి జిల్లా అశ్వారావుపేట నియోజకవర్గంలోని అశ్వారావుపేట మండలం పెదవాగు ప్రాజెక్టుకు గండి పడి రాష్ట్ర వ్యాప్తంగా సంచలనమైన నేపథ్యంలో ప్రాజెక్టును, దాని వల్ల సంభవించిన ప్రమాద తీవ్రతను పరిశీలించేందుకు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి, ఇదే నియోజకవర్గానికి చెందిన తుమ్మల నాగేశ్వరరావు ఆదివారం ఈ మండలంలో పర్యటించారు. ప్రాజెక్టును, కొట్టుకుపోయిన పంటలను, దెబ్బతిన్న ఇళ్లను, ధ్వంసమైన విద్యుత్ స్తంభాలను పరిశీలించారు. ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. వారికి ధైర్యం చెప్పారు. అయితే ఇంతటి ముఖ్యమైన ఈ పర్యటన ఇదే నియోజకవర్గ ఎమ్మెల్యే జారె ఆదినారాయణ గైర్హాజరవడం స్థానికంగా చర్చనీయాంశమైంది. పాలకుల నిర్లక్ష్యం వల్లే పెదవాగు ప్రాజెక్టు గండి పడడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో మంత్రి తుమ్మల పర్యటనకు ఎమ్మెల్యే దూరంగా ఉండడంపై పలు వాదనలు వినిపిస్తున్నాయి. ఎమ్మెల్యే జారే ఆదినారాయణ.. రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వర్గీయుడని ఇప్పటికే ప్రజల్లో ముద్ర ఉంది. ఈ క్రమంలో తుమ్మల పర్యటన ఆయన దూరంగా ఉండడం ఈ వాదనకు బలం చేకూరుస్తోందనే వాదనలు వినిపిస్తున్నాయి. కాగా, ఎమ్మెల్యే జారె వర్గీయులు ముందుగా హైదరాబాద్ పర్యటన పెట్టుకున్నారనే ప్రచారం జరుగుతోంది. ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా పొరుగు నియోజకవర్గమైన, పొంగులేటి వర్గీయుడిగా పేరున్న సత్తుపల్లికి చెందిన మువ్వా విజయ్‌బాబు బాధ్యతల స్వీకరణ కార్యక్రమానికి వెళ్లినట్లు చర్చ జరుగుతోంది. అయితే, మువ్వా బాధ్యతల స్వీకరణ కార్యక్రమంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పొన్నం ప్రభాకర్, అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణతోపాటు జిల్లాకు చెందిన పలువురు ఎమ్మెల్యే హాజరుకాగా.. మంత్రి తుమ్మల గైర్హాజరు కావడం పట్ల మరో చర్చ జరుగుతోంది. అయితే, మంత్రి తుమ్మల, ఎమ్మెల్యే జారె సొంత గ్రామం.. అశ్వారావుపేట నియోజకవర్గం దమ్మపేట మండలం గండుగులపల్లి కావడం విశేషం. తుమ్మల, పొంగులేటి మధ్య అంతర్గత వర్గపోరు కొనసాగుతోందని మండల ప్రజలు చర్చించుకుంటున్నారు.

ప్రశాంతంగా ముగిసిన సింగరేణి ఉద్యోగ నియామక పరీక్షలు

- త్వరలోనే కీ విడుదల చేస్తాం : సీఎండీ బలరాం

పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న సింగరేణి సీఎండీ బలరాం

కొత్తగూడెం సింగరేణి, జూలై 21 : సింగరేణి సంస్థలో 272 ఖాళీల భర్తీకి ఈ నెల 20, 21 తేదీల్లో 12 సెంటర్లలో నిర్వహించిన కంప్యూటర్ ఆధారిత పరీక్షలు విజయవంతంగా ముగిశాయి. సంస్థ సీఎండీ బలరాం ఆదేశాల మేరకు తొలిసారిగా హైదరాబాద్ కేంద్రంగా ఈ పరీక్షలను అత్యంత పటిష్టంగా, భద్రత ప్రమాణాలు పాటిస్తూ నిర్వహించారు. 20వ తేదీన మూడు షిఫ్టుల్లో జూనియర్ ఎస్టేట్స్ ఆఫీసర్, మేనేజ్‌మెంట్ ట్రైనీ(ఎఫ్అండ్ఏ), జనరల్ డ్యూటీ మెడికల్ ఆఫీసర్, మేనేజ్‌మెంట్ ట్రైనీ, హైడ్రోజియాలజిస్టు, మేనేజ్‌మెంట్ ట్రైనీ సివిలవ, జూనియర్ ఫారెస్టు ఆఫీసర్, మేనేజర్ ట్రైనీ (ఐఈ), సబ్ ఓవర్ సీర్ ట్రైనీ సివిల్ పోస్టులకు పరీక్ష నిర్వహించగా మొత్తం 11,724 మంది అభ్యర్థులకు గాను 7,073 మంది పరీక్షలు రాశారు. అలాగే 21వ తేదీన రెండు షిఫ్టుల్లో మేనేజ్‌మెంట్ ట్రైనీ(మైనింగ్), మేనేజ్‌మెంట్ ట్రైనీ పర్సనల్ పోస్టులకు పరీక్ష నిర్వహించగా 6,931 మంది అభ్యర్థులకు 4,972 అభ్యర్థులు పరీక్షలకు హాజరయ్యారు. మొత్తం మీద 18,665 మంది అభ్యర్థులకు గాను 12,045 మంది పరీక్షలకు హాజరయ్యారు. దాదాపు 65 శాతం మంది హాజరయ్యారు. ఆదివారం ఉదయం సంస్థ సీఎండీ బలరాం, డైరెక్టర్(పా) ఎన్‌వీకే శ్రీనివాస్ పరీక్షా కేంద్రాలను సందర్శించి పరీక్ష నిర్వహణలో పాటిస్తున్న జాగ్రత్తలను సమీక్షించారు. ఈ ప్రాథమిక సమాధాన పత్రాన్ని త్వరలోనే విడుదల చేయనున్నట్లు చెప్పారు.

ఆటుపోట్లకు ఆస్కారం

మార్కెట్ పల్స్

దేశీయ స్టాక్ మార్కెట్లలో గత వారం సైతం నూతన రికార్డులు నమోదయ్యాయి. అయితే వరుస లాభాలతో సూచీలు గరిష్ఠ స్థాయిల్లో కదలాడుతున్న వేళ.. మదుపరులు లాభాల స్వీకరణ దిశగా అడుగులు వేశారు. దీంతో ఓవరాల్‌గా స్వల్ప లాభాలతోనే సరిపెట్టుకోవాల్సి వచ్చింది. ఈ క్రమంలోనే అంతకుముందు వారం ముగింపుతో చూస్తే బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 85.31 పాయింట్లు పెరిగి 80,604.65 వద్ద నిలిచింది. అలాగే నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ 28.75 పాయింట్లు అందుకుని 24,530.90 దగ్గర ముగిసింది. శుక్రవారం భారీ నష్టాలు వాటిల్లకపోతే సూచీలు నయా ఆల్‌టైమ్ హైల్లోనే ఉండేవి. ఇక ఈ వారం కూడా మదుపరులు ఆయా సంస్థల త్రైమాసిక ఆర్థిక ఫలితాల ఆధారంగా తమ పెట్టుబడులపై నిర్ణయం తీసుకునే వీలున్నది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి (2024-25)గాను తొలి త్రైమాసికం (ఏప్రిల్-జూన్) కోసం కంపెనీలు తమ ఫైనాన్షియల్ రిజల్ట్స్‌ను ప్రకటిస్తున్న విషయం తెలిసిందే. అయినప్పటికీ సూచీలు రికార్డుస్థాయి గరిష్ఠాల్లో ఉన్నందున పెట్టుబడులు-ఉపసంహరణల మధ్య ఇన్వెస్టర్లు కొట్టుమిట్టాడేందుకే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. కాగా, గ్లోబల్ స్టాక్ మార్కెట్లు, విదేశీ సంస్థాగత మదుపరుల పెట్టుబడులు, అంతర్జాతీయ పరిణామాలు, డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ ఎప్పట్లాగే ఈ వారం కూడా భారతీయ స్టాక్ మార్కెట్ల తీరును నిర్దేశించనున్నాయి. అమ్మకాల ఒత్తిడి ఎదురైతే నిఫ్టీకి 24,200 పాయింట్ల స్థాయి కీలకమైనదనుకోవచ్చు. దీనికి దిగువన ముగిస్తే 23,900 పాయింట్ల స్థాయిని మద్దతుగా చెప్పుకోవచ్చని అత్యధిక నిపుణుల మాట. అయితే సూచీలు పరుగందుకుంటే ఈ వారం 24,700-24,900 మధ్యకు నిఫ్టీ వెళ్లవచ్చని కూడా చెప్తున్నారు.



ఆఖర్లో కాదు..

రుణ చెల్లింపుల్లో లాభం ఇలా

మనలో ప్రతి ఒక్కరూ ఎప్పుడో ఒకప్పుడు బ్యాంకుల్లో లేదా బ్యాంకింగేతర ఆర్థిక సంస్థ (ఎన్‌బీఎఫ్‌సీ)ల్లో రుణాన్ని తీసుకోవడం సహజం. అయితే ఆ రుణ భారాన్ని వీలైనంత త్వరగా తీర్చేసుకుందామనుకొని కొన్ని పొరపాట్లు చేస్తుంటారు. దీనివల్ల నష్టాల పాలవుతూంటారు. అందుకే రుణ చెల్లింపుల విషయంలో ఎప్పుడు? ఎలా? అన్నది అత్యంత ముఖ్యమైన అంశం. బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీల్లో లోన్లు తీసుకున్నప్పుడు.. వడ్డీతో కలిపి ఆ మొత్తాన్ని నిర్ణీత లేదా రుణగ్రహీత ఎంచుకున్న కాలవ్యవధికి సమాన ఈఎంఐలుగా పంచుతారు. అయితే ఈ నెలవారీ వాయిదాల్లో మొదట చెల్లిస్తూపోయే వాటిలో ఎక్కువ మొత్తం రుణంపై రుణదాతలు వసూలుచేసే వడ్డీనే ఉంటుంది. కాలం గడుస్తున్నకొద్దీ చివర్లో ఉండే ఈఎంఐల్లో వడ్డీకన్నా అసలే ఉంటుంది. అంటే.. రుణం తీసుకున్న తొలినాళ్లలో చెల్లించే ఈఎంఐల్లో ఎక్కువ మొత్తం వడ్డీ కిందనే పోతుంది. అసలు రుణంలో మైనస్ అయ్యేది చాలా తక్కువ. అలాగే ఆఖర్లో చెల్లించే ఈఎంఐల్లో వడ్డీకన్నా అసలు రుణమే ఎక్కువగా ఉంటుంది. కాబట్టి రుణ భారం తగ్గించుకోవాలనుకునేవారు మొదట్లోనే వీలైనంత చెల్లించడం మంచిది. ఆఖర్లో ఒకేసారి చెల్లించడం కన్నా ఈఎంఐలను అనుసరించడమే లాభదాయకం.

లోన్ పోర్టబులిటీ

రుణాలపై వివిధ బ్యాంకులు, సంస్థలు రకరకాల వడ్డీరేట్లను అనుసరిస్తాంటాయి. రుణగ్రహీత సిబిల్ స్కోర్‌తోపాటు మరికొన్ని అంశాలు ఇందులో ప్రధాన పాత్ర పోషిస్తాయి. అయితే మనం తీసుకున్న రుణంపై వడ్డీరేటు ఎక్కువగా ఉందనుకుంటే.. ఎందులో తక్కువగా ఉందో తెలుసుకుని ఆ మొత్తం రుణాన్ని అక్కడికి మార్చుకోవడం ఉత్తమం. దీన్నే లోన్ పోర్టబులిటీ అంటారు. దీనివల్ల వడ్డీ భారం తగ్గుతుంది. కానీ ఈ ప్రక్రియకు కొన్ని చార్జీలు వర్తిస్తాయి. వీటన్నిటినీ కలిపి లెక్కించే రుణాన్ని ఒక సంస్థ నుంచి మరో సంస్థకు మార్చుకోవడం లాభమా? నష్టమా? అన్నది తేల్చుకోవాలి. లేకపోతే భారం మరింత పెరిగే ప్రమాదం ఉన్నది.

ఐటీఆర్‌లో సెక్షన్‌తో కొడదాం



ఇది ఆదాయ పన్ను రిటర్ను (ఐటీఆర్)ల కాలం. 2023-24 ఆర్థిక సంవత్సరానికి (2024-25 మదింపు సంవత్సరం) గాను ఈ నెలాఖర్లోగా (జూలై 31) ఐటీఆర్‌ను దాఖలు చేయాల్సి ఉంటుంది. దీంతో పన్ను ఆదా కోసం ఉన్న మార్గాలను అంతా వెతుకుతున్నారు. అయితే అందరికీ తెలిసింది సెక్షన్ 80సీ మాత్రమే. కానీ ఐటీ చట్టంలోని వివిధ సెక్షన్ల కింద రకరకాల పెట్టుబడులు, ఖర్చులు, రుణాల చెల్లింపులు, వడ్డీ ఆదాయాలపై పన్ను మినహాయింపును పొందవచ్చు. వాటిని పరిశీలిస్తే..



1. నేషనల్ పెన్షన్ సిస్టమ్

నేషనల్ పెన్షన్ సిస్టమ్ (ఎన్‌పీఎస్)లో పెట్టుబడులకు సెక్షన్ 80సీ కింద రూ.1.5 లక్షలదాకా పన్నును ఆదా చేసుకోవచ్చు. ఇక సెక్షన్ 80సీసీడీ (1బీ) కింద అదనంగా మరో రూ.50,000 ఆదా చేయవచ్చు. మొత్తంగా రూ.2 లక్షలు ఆదా అవుతాయి.

2. ఆరోగ్య బీమా

సెక్షన్ 80డీ కింద ఆరోగ్య బీమా ప్రీమియంను క్లెయిం చేసుకోవచ్చు. ఎంత? అన్నది పాలసీ కవరేజీ, వయసుపై ఆధారపడి ఉంటుంది. ఇలా రూ.25,000, రూ.50,000, లక్ష రూపాయల వరకు పన్ను ఆదా చేసుకోవచ్చు.

3. విద్యా రుణం

పిల్లల విద్య కోసం రుణం తీసుకున్నట్టయితే.. దాని చెల్లింపులపైనా పన్ను మినహాయింపును క్లెయిం చేసుకోవచ్చు. సెక్షన్ 80ఈ కింద విద్యా రుణంలోని వడ్డీ భాగంపై పన్ను మినహాయింపును పరిమితి అనేదే లేకుండా పొందవచ్చు. రుణాన్ని చెల్లించేది తల్లిదండ్రులా.. పిల్లలా.. అన్న తేడా లేకుండా ఈ ప్రయోజనాన్ని అందుకోవచ్చు.

4. హోమ్ లోన్ వడ్డీ

గృహ రుణ చెల్లింపులపై రెండు మార్గాల్లో పన్ను మినహాయింపును క్లెయిం చేసుకోవచ్చు. ఒకటి సెక్షన్ 80సీ కింద అసలుపై రూ.1.5 లక్షల వరకు పన్ను ఆదా చేసుకోవచ్చు. మరొకటి సెక్షన్ 24 కింద వడ్డీ భాగంపై రూ.2 లక్షలదాకా పన్ను ఆదా కోరవచ్చు. కొన్న ఇంట్లో మీరున్నా.. లేదా దానిపై అద్దె ఆదాయం పొందుతున్నా.. పన్ను మినహాయింపులను అందుకోవచ్చు.

5. తొలిసారి ఇంటి కొనుగోలుపై

తొలిసారి ఇంటిని కొనుగోలుచేసేవారికి సెక్షన్ 80ఈఈ కింద గృహ రుణ వడ్డీపై కేంద్ర ప్రభుత్వం అదనపు పన్ను ప్రయోజనాలను కల్పిస్తున్నది. ఈ సెక్షన్‌లో రూ.50,000 వరకు ఎక్స్‌ట్రా ట్యాక్స్ క్లెయిములు చేయవచ్చు. సెక్షన్ 24 కింద వర్తించే మినహాయింపులకు అదనం. దీంతో రూ.2.5 లక్షల వరకు ప్రయోజనం ఉంటుంది. అయితే మీ పేరిట అంతకుముందు ఏ ఇల్లూ ఉండరాదు. అలాగే కొనే ఇంటి విలువ రూ.50 లక్షలు మించరాదు. తీసుకునే అప్పు కూడా రూ.35 లక్షలు దాటరాదు.

6. హెచ్ఆర్ఏ

ఉద్యోగులకు వారి సంస్థ యాజమాన్యాలు హౌజ్ రెంట్ అలవెన్స్ (హెచ్ఆర్ఏ)ను ఇస్తే.. అద్దెపై పన్ను మినహాయింపును పొందవచ్చు. సెక్షన్ 80జీజీ కింద ఈ అవకాశం ఉంటుంది.

7. ఎస్‌బీ అకౌంట్ వడ్డీ

సేవింగ్స్ బ్యాంక్ (ఎస్‌బీ) అకౌంట్ నుంచి అందుకునే వడ్డీ ఆదాయంపైనా పన్ను మినహాయింపును కోరవచ్చు. వడ్డీ ఆదాయం రూ.10,000 వరకుంటే సెక్షన్ 80టీటీఏ కింద ఎవరైనా వ్యక్తి లేదా హిందూ అవిభాజ్య కుటుంబం (హెచ్‌యూఎఫ్) ఐటీ ప్రయోజనాన్ని పొందవచ్చు.

8. దివ్యాంగుల కేర్ టేకర్‌గా..

మీరు దివ్యాంగుల బాగోగులు చూసుకుంటున్నట్లైతే సెక్షన్ 80డీడీ కింద వారి ఖర్చులపై పన్ను మినహాయింపులను కోరవచ్చు. అంగ వైకల్యాన్నిబట్టి మినహాయింపు ఎంత? అన్నది తెలుస్తుంది. రూ.75,000-రూ.1.25 లక్షల మేర ఉంటుంది.

9. వైద్య ఖర్చులకు..

క్యాన్సర్, నరాల వ్యాధులు, ఎయిడ్స్ వంటి రోగాల వైద్య ఖర్చులపైనా ఐటీ మినహాయింపును తీసుకోవచ్చు. సెక్షన్ 80డీడీబీ కింద రూ.40,000 వరకు పన్ను తగ్గింపును పొందవచ్చు. సీనియర్ సిటిజన్లకైతే లక్ష రూపాయలదాకా ప్రయోజనం ఉంటుంది.

10. విరాళాలు

విరాళాలపై సెక్షన్ 80జీ కింద పన్ను మినహాయింపును క్లెయిం చేయవచ్చు. అయితే మొత్తం డొనేషన్‌పై ప్రయోజనం రాదు. అలాగే గుర్తింపు పొందిన ఛారిటబుల్ సంస్థకు విరాళం ఇస్తేనే ఈ సౌకర్యం ఉంటుంది.

పన్ను వర్తించే శ్లాబులో మీ ఆదాయం ఉన్నట్లైతే.. ప్రతీ ఆర్థిక సంవత్సరం ఐటీఆర్‌ను తప్పక దాఖలు చేయాల్సిందే. అయితే ఆదాయ పన్ను పరిధిలో మనం లేముకదా.. అని చాలా మంది ఐటీఆర్‌ను లైట్ తీసుకుంటారు. కానీ ఐటీ పరిధిలోకి రాకున్నా.. ఏటా నిల్ ఐటీఆర్‌ను దాఖలు చేస్తే పలు ప్రయోజనాలున్నాయి. 60 ఏండ్లలోపున్నవారికి పాత పన్ను విధానంలోనైతే రూ.2.5 లక్షలు, కొత్త పన్ను విధానంలోనైతే రూ.3 లక్షలదాకా వార్షిక ఆదా యం ఉన్నా పన్నులు చెల్లించనక్కర్లేదు. ఇక నిల్ ఐటీఆర్‌ను దాఖలు చేస్తే వీసా దరఖాస్తుల కోసం ప్రధాన ఆదాయ ధ్రువీకరణగా ఉంటుంది. అలాగే రుణాలను తీసుకునేటప్పుడు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. ట్యాక్స్ రిఫండ్స్‌కూ దోహదపడుతుంది.

నిల్ ఐటీఆర్‌తో లాభాలివి..